క్లుప్తంగా

పరీక్ష సామగ్రి అందజేత



మనుబోలు: మండలంలోని వీరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు దాతలు మంగళవారం విద్యా సామగ్రి అందజేశారు. దాతలు మున్నారపు రఘురామయ్య, పాట్రేళ్ల ప్రసాద్‌లు వాటిని వితరణ చేశారు. పరీక్ష స్థానాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, టీచర్లు పాల్గొన్నారు.

వీఎస్‌యూ వీసీకి సత్కారం



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎ.రాజశేఖరం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వర్సిటీ అభివృద్ధికి బ్యాంక్ తరఫున సహకారం అందిస్తామని, త్వరలో ఎలక్ట్రిక్ కార్లు ఇస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం బ్యాంకింగ్ సేవలు, విద్యా రుణాలు, ఇతర అంశాలపై ఇరువురు చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సాయిప్రసాద్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బీవీ నగర్ బ్రాంచ్ మేనేజర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు సర్వే



ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

మనుబోలు: పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని ఎంపీఈఓ జలజాక్షి అన్నారు. మనుబోలు సచివాలయం – 2ను మంగళవారం ఆమె సందర్శించి సర్వేపై ఉద్యోగులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు పీ4 సర్వేలో పాల్గొన్నారు. ఇంటి సభ్యుడి బయోమెట్రిక్ లేదా ఫోన్ ఓటీపీ ద్వారా సర్వే వివరాలను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణి, డిజిటల్ అసిస్టెంట్ సుమన ఉన్నారు.

13 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



ఇందుకూరుపేట: మండలంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. నరసాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలపై రైతులకు వివరించారు. వీఏఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



విడవలూరు: స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 60వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపల్ సుజాత, కెనరా బ్యాంక్ మేనేజర్ గౌతమ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై విహారం



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని రామకృష్ణనగర్‌లో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్పవృక్ష వాహనంపై మంగళవారం విహరించారు. భక్తులు విశేషంగా హాజరై దర్శించుకున్నారు.

సంగమేశ్వరాలయం.. ఎంతో ప్రత్యేకం



సంగమేశ్వరాలయం

- శతాబ్దాల క్రితం నిర్మాణం
- ఏటా తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

మనుబోలు: మండలంలోని బద్దెవోలు రోడ్డు పక్కన కండలేరు ఒడ్డున వెలసిన కామాక్షీతాయి సమేత సంగమేశ్వరాలయానికి ఎంతో చరిత్ర ఉంది. జిల్లాలో మహిమాన్విత శైవ క్షేత్రంగా వెలుగొందుతోంది. ఈ ఆలయం ఎప్పుడు నిర్మించారో ఎక్కడా సరైన ఆధారాల్లేవు. వందల ఏళ్ల క్రితం నిర్మించినట్లు పెద్దలు చెబుతుంటారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

ఇలా చెబుతారు..

పరశురాముడు తల్లిని సంహరించిన అనంతరం పాప ప్రక్షాళన కోసం దేశంలో ఎన్నో శైవక్షేత్రాలను నిర్మించాడు. అయినా పాప పరిహారం జరగకపోవడంతో ఆయన తండ్రి, గురువు అయిన జమదగ్ని మహర్షి ఆజ్ఞ మేరకు చివరగా మనుబోలు సమీపంలోని కండలేరు ఒడ్డున సంగమేశ్వరాలయాన్ని నిర్మించాడని పెద్దలు చెబుతుంటారు. తూర్పు ముఖ ద్వారంతో ఉన్న ఈ ఆలయంలో వెలుపలకు వెళ్లే మార్గం దక్షిణం వైపు ఉంటుంది. వచ్చి, వెళ్లే మార్గాలు వేరుగా ఉండటంతో పాప ఫలాలు అక్కడే ఆగిపోతాయని భక్తుల నమ్మకం. ఏటా ఏప్రిల్ 9 నుంచి 17వ తేదీ వరకు సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడి రథోత్సవం ఎంతో ప్రసిద్ధి చెందింది. సుమారు 30 అడుగుల ఎత్తున్న స్వామి రథాన్ని భక్తులు భుజాలపై మోసుకెళ్లడం ప్రత్యేకత.



మర్రి ఆకుపై..

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పొదలకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉభయకర్తలుగా కోడూరు శ్రీనివాసులు – వెంకటసుబ్బమ్మ, కోడూరు మస్తానయ్య – ప్రత్యూష ప్రమీల, నాగారం శివప్రసాద్ – స్రవంతి, చంద్రశేఖర్ – శ్రావణి దంపతులు వ్యవహరించారు.

➡ విజేత స్కూల్లో మంగళవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివలింగాన్ని ఏర్పాటు చేయగా పిల్లలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కరస్పాండెంట్ జి.కామాక్షి, టీచర్లు పాల్గొన్నారు. అమరావతి స్కూల్లోనూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు దేవతామూర్తుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ కె.సురేష్, టీచర్లు పాల్గొన్నారు.

➡ మర్రి ఆకుపై శివపార్వతుల చిత్రాన్ని మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య చిత్రీకరించారు.

➡ ముత్తుకూరు: మండలంలోని నారికేళపల్లి పంచాయతీలో సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం అట్టముక్కలతో శివలింగాన్ని చిత్రీకరించారు.

ఎన్నో ఏళ్లుగా బ్రహ్మోత్సవాలు



సంగమేశ్వరాలయానికి సంబంధించి బ్రహ్మోత్సవాలు ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నాయి. రథోత్సవం ఎంతో ప్రత్యేకమైంది. అంత పెద్ద తేరు (దేవుని రథం)ని భక్తులు సుమారు ఐదు కిలోమీటర్ల దూరం భుజాలపై మోసుకెళ్తారు. రథోత్సవాన్ని చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు.

– దుగ్గన చంద్రయ్య, మనుబోలు

భక్తులు వస్తుంటారు



మనుబోలులో చాలా దేవాలయాలున్నా సంగమేశ్వరాలయానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఉత్సవాలను చూసేందుకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. వందల ఏళ్ల క్రితం నిర్మించింది కావడంతో ఆలయంపై దేవతామూర్తుల ఆకృతులు దెబ్బతిన్నాయి. దాతలు స్పందించి ఆలయాన్ని ఆధునీకరిస్తే బాగుంటుంది.

– ఫణీంద్రశర్మ, ఆలయ అర్చకుడు



పొదలకూరు: ప్రత్యేక పూజలు



అట్టముక్కలతో..

దాతలు ముందుకు రావాలి

- కలెక్టర్ ఆనంద్

పొదలకూరు: దొడ్ల కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని జిల్లాలోని వ్యాపారవేత్తలు, ఇతర ప్రాంతాల్లో ఉన్నత స్థానంలో ఉన్న వారు, దాతలు ముందుకొచ్చి పాఠశాలలు, వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ పిలుపునిచ్చారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు రూ.2.90 కోట్లతో మండలంలోని మహ్మదాపురం గ్రామంలో దొడ్ల శేషారెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన దొడ్ల శంకరమ్మ ఈస్ట్‌బ్లాక్ హాస్టల్ భవనాన్ని మంగళవారం సంబంధిత శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా కలెక్టర్ మాట్లాడారు. విద్యా, వైద్య రంగాల్లో దొడ్ల కుటుంబానికి జిల్లాలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆరు దశాబ్దాల క్రితమే వారు విద్యకు పెద్దపీట వేసినట్టు తెలిపారు. మహ్మదాపురంలో స్కూల్ పక్కనే ఉన్న ఎస్సీ, బీసీ వసతి గృహాలను మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి మోడల్ స్కూల్‌గా రూపొందిస్తామన్నారు. అధునాతన కంప్యూటర్ ల్యాబ్, క్రీడా మైదానం, క్రీడాలకు సంబంధించిన కోర్టులు, వంటగది తదితర సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయిస్తామన్నారు. వచ్చే రెండు, మూడేళ్లలో హాస్టల్, స్కూల్‌కు అత్యున్నత ప్రమాణాలను అందజేయడం జరుగుతుందన్నారు. దొడ్ల డెయిరీ చైర్మన్ దొడ్ల శేషారెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ఏదైనా మంచి చేయాలనే తపన ఉన్న కలెక్టర్ రావడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. హాస్టల్ భవనాన్ని పరిశీలించి పూర్వ విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో దొడ్ల డైరీ ఎండీ దొడ్ల సునీల్‌రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖాధికారులు వెంకటలక్ష్మి, శోభారాణి, జి.తిరుపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

రూ.రెండు కోట్లతో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని రూ.రెండు కోట్లతో అభివృద్ధి చేయనున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీని మంగళవారం సందర్శించిన అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజతో సమావేశమయ్యారు. గుండె సంబంధిత వ్యాధులు, చిన్న పిల్లల అత్యవసర వైద్యసేవలకు అవసరమైన పరికరాలపై ఆరాతీశారు. అనంతరం సుప్రజ మాట్లాడారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించనున్నామని వివరించారు. వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోదండరామిరెడ్డి, డాక్టర్లు వెంకటేశ్వర్లు, సహనా, అబ్దుల్ సమద్ తదితరులు పాల్గొన్నారు.



జొన్నవాడ ఆలయంలో శుద్ధి

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయాన్ని మంగళవారం మధ్యాహ్నం వరకు మూసేశారు. ఆలయ పూజారి వెంకటకృష్ణానందప్రసాద్ తల్లి మృతి చెందారు. నిబంధనల మేరకు ఆలయానికి వంద మీటర్లలోపు ఎవరైనా మృతి చెందితే మూసేసి శుద్ధి అనంతరం తిరిగి దర్శనాలను ప్రారంభిస్తారు. దర్శనానికి సాయంత్రం నుంచి ఏర్పాట్లు చేశారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కురిచెర్లపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు విజ్జిగిరి వెంకటరమణయ్య కుమార్తె వివాహం ఇటీవల జరగ్గా, వధూవరులను ఆశీర్వదించేందుకు సోమవారం రాత్రి గోవర్ధన్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని, అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతోందని స్థానికులు కాకాణి ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి ప్రజాసేవను మర్చిపోయారన్నారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించడం తప్ప, శాంతిభద్రతల గురించి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తిస్థాయిలో వ్యతిరేకత ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆ ఊసే లేకుండా పాలన కొనసాగించడం దారుణమన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన గోవర్ధన్‌రెడ్డి

రెవెన్యూ సదస్సులపై ఆరా

పొదలకూరు: కలెక్టర్ ఒ.ఆనంద్ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల వినతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఏ మేరకు పరిష్కరించారో ప్రశ్నించారు. అనంతరం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

పొదలకూరు: బీసీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు సంబంధించి సబ్సిడీ రుణాల కోసం మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిప్రసాద్ పర్యవేక్షణలో బ్యాంకర్లు ఇంటర్వ్యూలను నిర్వహించారు. వీటికి 506 మంది హాజరయ్యారు. ఎస్‌బీఐ, యూనియన్, ఏపీజీబీ, డీసీసీబీ బ్యాంకర్లు వచ్చారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు, ఇస్కపాళెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి మాట్లాడుతూ వరి సాగులో క్రిమిసంహారక మందులను విచక్షణారహితంగా వాడొద్దని సూచించారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకున్న తరుణంలో రసాయన మందుల వాడకంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకే తగిన మోతాదులో పురుగు మందులను వాడాలన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ మొదలైన పథకాలను రైతులు పొందాలంటే ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు శివకుమార్, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

గంగవరంలో ఫాగింగ్

కోవూరు: గంగవరంలో దోమల నివారణకు ఫాగింగ్‌ను గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్నెస్సెస్ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. డీన్ కుమార్, ఎన్నెస్సెస్ విభాగాధికారి మురళీకృష్ణ, కళాశాల క్యాంపస్ మేనేజర్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో తొమ్మిది మంది అరెస్ట్

బుచ్చిరెడ్డిపాళెం: దాడి కేసులో తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. మండలంలోని చెల్లాయపాళెంలో తమ్మిరెడ్డి మల్లికార్జున్, అతని తమ్ముడి కుటుంబసభ్యులకు మధ్య వివాదం నెలకొంది. భూమి విషయంలో మల్లికార్జున అన్యాయం చేస్తున్నారంటూ సోదరుడి భార్య, పిల్లలు ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి వచ్చిన తొమ్మిది మంది కిరాయి మనుషులు గ్రామంలో కర్రలు, కత్తులతో దాడి చేయడంలో పలువురు గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితులను అరెస్ట్ చేశామని ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలోని రెండు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ శైలజాకుమారి మనుబోలులోని శ్రీరవి ఫర్టిలైజర్స్, కోదండరామపురంలోని శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపులకు వెళ్లి ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. పురుగు మందులు, ఎరువులు విక్రయించే సందర్భంలో తప్పనిసరిగా రైతు పేరుతో బిల్లులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని తెలిపారు. అంతకు ముందు స్థానిక సచివాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరిపైరును ఆశించే చీడపీడలు, వాటి నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్, దామిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కబడ్డీ, వాలీబాల్ కోచింగ్ క్యాంప్

వెంకటాచలం: మండలంలోని సరస్వతి నగర్ వద్దనున్న అలెక్సా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ చేతుల మీదుగా కబడ్డీ, వాలీబాల్ కోచింగ్ క్యాంప్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులను ఎంపిక చేసి నాలుగురోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ ఆనంద్, సుమంత్, ఉమామహేష్, సందీప్, పద్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.



క్యాంప్‌ను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

వసతి గృహాల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

పొదలకూరు: జిల్లాలోని వసతి గృహాల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని ఎస్సీ, బీసీ జిల్లా సంక్షేమాధికారులు శోభారాణి, వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురానికి మంగళవారం విచ్చేసిన వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ హాస్టల్స్‌లో టెన్త్ విద్యార్థులు 406 మంది, బీసీ హాస్టల్స్‌లో 552 మంది ఉన్నట్టు తెలిపారు. వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. పొదలకూరు, ఆత్మకూరు, కావలి, మహ్మదాపురం బీసీ హాస్టల్స్‌లో డిజిటల్ విద్యను ఏర్పాటు చేశామన్నారు. శని, ఆదివారాల్లో వెనుకబడిన టెన్త్ విద్యార్థులకు డిజిటల్ వీడియోస్ ద్వారా తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో అన్ని వసతి గృహాలకు ట్యూటర్స్ ఉన్నారని మారుమూలగా ఉండే ఒకటి, రెండు చోట్ల అందుబాటులో లేరన్నారు. వారి వెంట ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూఓ బ్రహ్మానందచారి ఉన్నారు.



మాట్లాడుతున్న శోభారాణి, వెంకటలక్ష్మి

ప్రీ స్కూల్ పిల్లల సంఖ్యను పెంచాలి



ఇందుకూరుపేట: నరసాపురంలో..



కొడవలూరులో..

ఇందుకూరుపేట: ప్రీ స్కూల్ పిల్లల సంఖ్యను పెంచాలని, తద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఎంఈఓ ఎస్వీ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం నిర్వహించిన జ్ఞాన జ్యోతి ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో ఉపయోగించి చిన్నారుల మెరుగైన భవిష్యత్తుకు బాటలేయాలని కోరారు. ఎంఈఓ – 2 సునీల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, సీడీపీఓ రాజేశ్వరి, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు సుబ్బరత్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: శిక్షణలో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు విధిగా అమలు చేయాలని కీ రిసోర్స్ పర్సన్ నరసయ్య పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో జ్ఞానజ్యోతిపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, అంకయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఆందోళన



మాట్లాడుతున్న నేతలు

కోవూరు: ప్రభుత్వ స్కూళ్లను యథావిధిగా కొనసాగించాలని ఆవాజ్ నేత చాన్‌బాషా కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదుట ఆందోళనను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చి, విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం డీటీకి వినతిపత్రమిచ్చారు. ప్రజాసంఘాల నేతలు చాంద్‌బాషా, బుజ్జయ్య, అఫ్రోజ్, బాబు, శేషయ్య, ఫాతిమా, సర్దార్ అహ్మద్, మాబాషా, ఫాతిమా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి ఆలయంలో పూజలు నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించనున్నామని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నవావరణ పూజలు, ప్రత్యేక పుష్పాలంకారం, వెండి నంది ఉత్సవం, లింగోద్భవ కాల అభిషేకం తదితరాలను నిర్వహించనున్నామని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

ఇందుకూరుపేట: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

విశిష్ట సంఖ్యకు 28లోపు నమోదు చేసుకోవాలి

కొడవలూరు: పొలమున్న రైతులు విశిష్ట సంఖ్యకు ఈ నెల 28లోపు నమోదు చేసుకోవాలని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలికలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతులు విధిగా నమోదు చేసుకోవాలని కోరారు. పంట నమోదు, ఈ – కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు. ఏఓ లక్ష్మి, వీఏఏలు సుజిత్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.